క్లుప్తంగా

అమ్మవారికి బోనాలు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సోమవారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆదివారం నుంచి ఈదమ్మ దేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా సోమవారం గ్రామంలోని బెస్తగేరికి చెందిన మహిళలు కుంకుమ, పసుపు, పూలు, వేపాకులు తదితర వాటితో అందంగా అలంకరించిన బోనంలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని ఊరేగింపుగా వెళ్లారు. ఈదమ్మ తల్లి ఆలయం వద్ద వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోడిపుంజులు, గొర్రె పాటేళ్ల అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం ఈదమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా బోనాలు తీసుకరావడం ఆనవాయితీగా వస్తుందని కాలనీవాసులు తెలిపారు.

అభివృద్ధికి సహకరించండి



పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన ఒబేదుల్లా కొత్వాల్‌ను సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్ ఆధ్వర్యంలో పలువురు మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాన్‌గల్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒబేదుల్లా మజహర్, కర్ణాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించే సీసీ రోడ్ల పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నాగౌడ్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను నాణ్యవంతంగా చేపట్టి, క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆశన్న, శ్రీనివాస్‌గౌడ్, కురుమన్న, వెంకటస్వామి, గోవిందు, చింతలయ్య, శివ, లాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



వనపర్తి టౌన్: గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులై వారు ఎంచుకున్న సబ్జెక్టులను తోటి విద్యార్థులకు బోధించారు. ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, పూర్వపు ఏఎంఓ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్యశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, అశోక్ కుమార్, రాధ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్.. హైవేస్ట్



అమరచింత: మండలంలోని కిష్టంపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవట్లేదు. ఇందిరమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని నెలలుగా ఒరిగిపోతూ కిందపడుతున్న వాటిని తొలగించడంలో విఫలమవుతున్నారు. చౌరస్తాలో రాత్రి వేళల్లో వెలుతురు ఉండాలని ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను పునరుద్ధరించాలని జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన

- అర్హులందరికీ న్యాయం
- తొమ్మిది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక



ఆత్మకూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు

ఆత్మకూర్: ధరణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, దరఖాస్తులను వేగవంగంగా పరిశీలిస్తున్నామని తహసీల్దార్ రాజు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ తొమ్మిది రోజుల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. భూ సమస్యలు, పేర్లల్లో తప్పులు, ఇతరత్రా దరఖాస్తులన్నింటిని పరిశీలించి నివేదిస్తామని తెలిపారు. మొత్తం 225 దరఖాస్తలకు గాను 18 దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ కార్యాలయానికి పంపించామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐ జయమ్మ, జూనియర్ అసిస్టెంట్లు ప్రసాద్, వరుణ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. మూడో రోజు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 357 దరఖాస్తుల్లో సోమవారం 25 దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేసి కార్యాలయంలో పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరిస్తూ.. మిగిలిన వాటిని జిల్లా అధికారులకు నివేదిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో..

మెనూ ప్రకారం భోజనం అందించాలి



తెల్లరాళ్లపల్లి పీఎస్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, కేతేపల్లి ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రతి నిత్యం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తూ నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లక్ష్మణ్‌యాదవ్, శివ కుమార్ , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ఆరా

మండలంలోని కేతేపల్లిలో తాగునీటి సరఫరాపై గ్రామస్తులతో జీపీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌నాయక్ చర్చించి వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, బోర్లలో నీరు పుష్కలంగా ఉన్న వాటర్‌మెన్ సరఫరా సక్రమంగా లేక పలు కాలనీల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సరఫరాను మెరుగుపర్చి నీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇస్తూ ప్రస్తుతం ఉన్న వాటర్‌మెన్‌ను తొలగించి సరఫరా బాధ్యతలను వేరే వ్యక్తికి అప్పగించినట్లు ప్రత్యేక అధికారి పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తత అవసరం

పెబ్బేరు రూరల్: ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సూచించారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజా పాలన కార్యక్రమంలో చాలా మంది రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇదే అదునుగా చేసుకొని సైబర్ మోసగాళ్లు మీకు ఇల్లు వచ్చింది, మహాలక్ష్మి పథకం డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో పడాలంటే మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ నంబరు చెప్పమని అడుగుతున్నారని అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని, అనవసరం లింక్ లను ఓపెన్ చేయొద్దన్నారు. అలాంటి వారి నుంచి ఫోన్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 423 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 388 మంది విద్యార్థులు హాజరయ్యారు. వికాస్ కళాశాలలోని సెంటర్ 203 విద్యార్థులకు గాను 196 మంది విదార్థులు హాజరయ్యారని ఎక్సామినేషన్ సూపర్‌వైజర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తెలిపారు. సెంటర్లలలో విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించామన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఐదో రోజు సోమవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 113 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ రాములు తెలిపారు. కళాశాల పరిసరాలల్లో గుంపులు, గుంపులుగా గుమికూడకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వేణు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సూచిక బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం



మున్సిపల్ కార్యాలయానికి పరిమితమైన సూచిక బోర్డు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు, గ్రామకంఠం స్థలాల్లో మున్సిపల్ అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న కందకం స్థలాన్ని అక్రమంగా స్వచ్ఛంద సంస్థ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనపై కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే చేసి గ్రామకంఠం స్థలం అని నివేదిక అందించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినా.. వీటిపై పూర్తి స్థాయిలో బాధ్యత ఉన్న మున్సిపల్ అధికారులు మాత్రం వీటిని సంరక్షించే యత్నాలు చేయట్లేదనే విమర్శలు ఎక్కువయ్యాయి. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూచిక బోర్డును తయారు చేసిన మున్సిపల్ అధికారులు వీటిని గ్రామ కంఠంగా గుర్తించిన స్థలంలో పాతలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాల్లో మున్సిపల్ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వాటిని సంరక్షించాలని కోరుతున్నారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల రైతు వేదికలో సోమవారం కౌలు రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రిలీగల్ క్లీనిక్ ప్యారలీగల్ వలంటర్ శ్రీనివాసులు కౌలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



శ్రీశైలానికి శివ మాలధారులు



పాన్‌గల్: మహా శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని అన్నారం, అన్నారంతండాలో శివ మాలధారులు సోమవారం గ్రామం నుంచి పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాలధారులు గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేష్‌నాయుడు, ప్రేమ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

రిపోర్టర్‌పై ఫిర్యాదు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన ఓ టీవీ చానల్ ప్రతినిధి (సాక్షి కాదు)పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎస్పీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు. వెల్టూర్‌కు చెందిన కావలి వెంకటయ్య, వడ్డె శేఖర్ ట్రాక్టర్లతో ప్రభుత్వ పనుల నిమిత్తం డీడీలు కట్టి అన్ని అనుమతులు తీసుకుని ఇసుకను తరలిస్తుండగా ఓ చానల్ విలేకరి బండి రాజు నిరంతరం వేధిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.

పోలియో మహమ్మారిని తరిమేద్దాం



తిప్పడంపల్లిలో పోలియో చుక్కలు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ఆత్మకూర్: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని తరిమేద్దామని వైద్యశాఖ స్టేట్ మానిటరింగ్ అధికారులు రామాంజనేయులు, నర్సింహారెడ్డి, తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ అన్నారు. సోమవారం రెండో రోజు పల్స్‌పోలియో కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని గ్రామాల్లో స్టేట్ మానిటరింగ్ అధికారులు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమం మంగళవారం కొనసాగుతుందని, ఐదేళ్లలోపు చినారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని, పీహెచ్‌సీ పరిధిలో 5,257 మంది చిన్నారులు ఉండగా.. ఇప్పటి వరకు 5,110 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పాన్‌గల్: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 28 పంచాయతీలల్లో ఐదేళ్ల లోపు చిన్నారులు 4,237 మందిని గుర్తించగా.. మొదటి రోజు 98 శాతం పూర్తి చేశామని, మిగిలిన వారికి ఇంటింటికీ తిరుగుతూ చుక్కలు వేస్తున్నట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని గ్రామాల్లో సోమవారం ఐదేళ్ల లోపు చిన్నారులకు మండల వైద్య బృందాలు పోలియో చుక్కలు చేశారు. పెబ్బేరు మండలంలోని గుమ్మడం తండాలో ఆశావర్కర్ రవణమ్మ రెండో రోజు ఆరు బయట చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మంగళవారం కూడా కార్యక్రమం కొనసాగుతుందని, తల్లిదండ్రులు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి రాముడు కోరారు.



గుమ్మడంతండాలో..



కదిరెపాడులో..



దుప్పల్లిలో..

'ఐసీడీఎస్'కు బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న నిక్సన్

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ 1957 అక్టోబర్ 2న ఐసీడీఎస్ ఏర్పడిందని, 48ఏళ్లు కావస్తున్నా 60శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక ప్రైవేట్ భవనాల్లో కొనసాగిస్తున్నారని, వాటిలో సరైన వసతులు లేక టీచర్లు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 10ఏళ్లు గడుస్తున్నా ఆరోగ్యలక్ష్మి, మెస్ చార్జీలు పెంచలేదని మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బీరువాలు, టేబుళ్లు, కుర్చీలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, సరిపడా వంట పాత్రలు ఇవ్వడం లేదని, కూరగాయలు, పాలు భద్రపర్చుకోవడానికి ఫ్రిజ్ ఇవ్వలేదని, సబ్బులు, చీపుర్లు, బిందెలు, బకెట్లు సరిపోను ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత లేకుండా పోతుందని, నిబంధనల ప్రకారం 50గ్రాముల గుడ్లు కాకుండా చిన్నగా ఉండే గుడ్లను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ బిల్లులు ఇవ్వడం లేదని, కేంద్రాల అద్దెలు, టీఏ, డీఏలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేక అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18వేల వేతనం, పీఎఫ్, సౌకర్యం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వనజకుమారి, సావిత్రి, ప్రసన్న, కళావతి, బాలీశ్వరమ్మ, అన్నపూర్ణ, దీనమ్మ, తస్లీమా, లక్ష్మి తదితరులు ఉన్నారు.

విరిగిన ఇనుప విద్యుత్ స్తంభం



విరిగిపోయిన ఇనుప విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయం వెనుక భాగంలో గల ఇనుప విద్యుత్ స్తంభం సోమవారం ఉన్నట్టుండి విరిగిపోయింది. సుమారు వంద కిలోల బరువు ఉండే ఈ స్తంభం విరిగిన సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం విగిరిపోవడంతో వల్లభ్‌నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని రోజులుగా ఇనుప విద్యుత్ స్తంభం ఒరిగి ఉందన్న విషయం విద్యుత్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇనుప స్తంభం విరిగిందని దుయ్యబట్టారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే స్తంభాన్ని మార్చి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఉన్న ఇనుప స్తంభాలను, శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు గులాం ఖాదర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని వినతి



మాట్లాడుతున్న మహమూద్

అమరచింత: బీడీ తయారీపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమూద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి బీడీ కార్మిక సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బీడీ కార్మికుల వేతనాల ఒప్పంద కాలం రెండేళ్లు పూర్తయినా సందర్భంగా బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యానికి డిమాండ్ నోటీస్ ఇవ్వాలనే ఆలోచనతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. బీడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, గ్రాడివిటీ ఇవ్వాలన్నారు. అమరచింతలో 4 వేల బీడీ గుర్తింపు కార్డులు ఉన్నా.. చాలా మందికి జీవన భృతి రావడం లేదని, కేవలం అధికారికంగా ఆరు వందల మందికి జీవనభృతి పింఛన్లు వస్తున్నాయని వివరించారు. చాలీచాలని వేతనాలతో అర్ధాకలితో అలమటిస్తూ జీవనం గడుపుతున్న బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, ఆర్‌ఎస్ రమేష్, బుచ్చన్న, వెంకటన్న, అనంతమ్మ, మాణిక్యమ్మ, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి



సంతకాల ప్రతిని అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి 16 వరకు 133 గ్రామాల్లో ప్రచారం చేశారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 9,861 మంది రైతులు, కార్మికులు, ప్రజలతో సంతకాల సేకరించామన్నారు. ఈ సమాచారాన్ని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులుతో కలిసి సోమవారం హైదారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు చుక్క రాములు, పాలడగు భాస్కర్‌కు అందజేశారు.

శ్రీశైలం మల్లన్న పాట ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: నియోజకవర్గానికి చెందిన జానపద కళాకారుడు మీసాల రామన్న, సంధ్యారాణిలు నటించి, చిత్రీకరించిన శ్రీశైల మల్లన్న దారి చూపగ రావా అనే పాటను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలోని మంత్రి నివాసంలో కళాకారులు ఆయనను కలిశారు. శ్రీశైలం మల్లన్న స్వామి ఇరుముడి అంశాలను ప్రస్తావిస్తూ పాటకు రూపకల్పన చేశారని మీసాల రామన్న మంత్రికి వివరించారు. కళాకారులు తమ ప్రతిభను ప్రజలను చైతన్యం చేసేందుకు, ఆధ్యాత్మికంగా, సేవాపరంగా సన్మార్గంలో నడిచేవిధంగా ప్రదర్శించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ పసుపుల నర్సింహ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి మహిళ మృతి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో బస్సు కింద పడి మహిళ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వనపర్తి పట్టణ ఎస్‌ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని ఇందిరానగర్ చెందిన గోవిందమ్మ (50) సోమవారం గోపాల్‌పేట మండలంలోని ఏదుట్లకు వెళ్లేందుకు రాజీవ్‌చౌరస్తాలో లింగాల బస్సులో ఎక్కే క్రమంలో అదుపు తప్పి కింద పడిపోయింది. కింద పడ్డ ఆమె కాళ్లపై బస్సు టైరు ఎక్కడంతో కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం జరిగింది. అటుగా వెళ్తున్న హోంగార్డు కృష్ణసాగర్ స్పందించి బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రిలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి విద్యార్థులకు గాయాలు

కోడేరు: బైక్ అదుపు తప్పి ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పెద్దకొత్తపల్లికి చెందిన శివశంకర్, ఓబులేష్‌లు కోడేరులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసి బైక్‌పై వెళ్తున్నారు. మండల కేంద్రం సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరి విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ తరలించారు.

నటనలో ప్రావీణ్యం అవసరం

ఆత్మకూర్: బాలు ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రాణభయం–2 వెబ్ సీరీస్‌లో నటించేందుకు నూతన నటులకు అవకాశం కల్పిస్తున్నామని దర్శక, నిర్మాత మాస్టర్ బాలు అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లో నటీ, నటులకు ఆడిషన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు యువత ఎంపికల్లో పాల్గొన్నారు. ఆసక్తి ఉన్న 16 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఈ నెల 15 వరకు జరిగే ఆడిషన్స్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, వివరాలకు 98484 56391 నంబరుకు సంప్రదించాలని కోరారు.